## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ఉత్తరాంధ్రను లాజిస్టిక్ హబ్ గా మార్చేందుకు కృషిచేస్తున్నామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- కేంద్ర ప్రభుత్వం వివిధ విభాగాలలో అందించే స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను ఈరోజు ప్రకటించింది.
- రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన సంవత్సర కాలంలోనే 7 లక్షల ఉద్యోగాల కల్పన జరిగిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.
- భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న మూడవ టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ లో ఈరోజు భోజన విరామ సమయానికి భారత్ 4 వికెట్ల నష్టానికి 248 పరుగులు చేసింది.

===================

ఉత్తరాంధ్రను లాజిస్టిక్ హబ్ గా మార్చేందుకు కృషిచేస్తున్నామని పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. విశాఖపట్నంలోని సాగర్ మాల కన్వెన్షన్ సెంటర్‌లో ఈరోజు నిర్వహించిన రోజ్‌గార్ మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, 52 మందికి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. రోజ్‌గార్ మేళాను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని, ప్రపంచంలో భారత్ నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో తీరం వెంబడి రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, ప్రస్తుతం సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేసే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అలాగే.. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు శరవేగంగా జరుగుతున్నాయని రామ్మోహన నాయుడు తెలియజేస్తూ...

(వాయిస్ బైట్...27 సెకన్లు)

===================

కేంద్ర ప్రభుత్వం వివిధ విభాగాలలో అందించే స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను ఈరోజు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం, రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి, గుంటూరుకు వివిధ అవార్డులు దక్కాయి. జాతీయ స్థాయిలో ప్రత్యేక కేటగిరీ మినిస్టీరియల్ అవార్డును విశాఖపట్టణం నగరం దక్కించుకుంది. రాష్ట్ర స్థాయిలో మినిస్టీరియల్ అవార్డుకు రాజమహేంద్రవరం ఎంపికైంది. స్వచ్ఛ సూపర్‌లీగ్ నగరాల విభాగంలో విజయవాడ, గుంటూరు, తిరుపతి ఎంపికయ్యాయి. రాష్ట్రంలోని ప్రధాన నగరాలు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులకు ఎంపిక కావడంపై ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ బి.పట్టాభిరామ్ సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల వల్లే ఈ అవార్డులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు.

===================

రాష్ట్రంలో ఎన్డిఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన సంవత్సర కాలంలోనే 7 లక్షల ఉద్యోగాల కల్పన జరిగిందని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈరోజు శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలోని పలు వార్డులలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి

పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు అందిస్తూ, సహకరిస్తోందని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సత్యకుమార్ యాదవ్ పేర్కొంటూ..

(వాయిస్ బైట్...23 సెకన్లు)

==================

రాష్ట్రంలో నిరుద్యోగులుగా ఉన్న 590 మంది వేద పండితులకు నెలకు 3 వేల రూపాయల భృతి ఇవ్వాలని నిర్ణయించామని దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి వెల్లడించారు. ఈరోజు తిరుమల అన్నమయ్య భవనంలో దేవదాయశాఖ, తిరుమల తిరుపతి దేవస్థానం(టిటిడి) సంయుక్తంగా సమీక్ష సమావేశం నిర్వహించాయి. అనంతరం సమావేశం వివరాలను మంత్రి పాత్రికేయులకు వెల్లడించారు. దేవస్థానం పరిధిలోని కళాశాలలు, పాఠశాలల్లో 192 పోస్టుల భర్తీపై చర్చించామని తెలిపారు. శ్రీవాణి ట్రస్టు నిధులపై నిర్ణయం తీసుకుంటామని దేవస్థానం తెలిపిందని, విజయవాడ దుర్గ గుడికి మరో రహదారి నిర్మించేందుకు టీటీడీ సహకారాన్ని దేవాదాయశాఖ కోరిందని మంత్రి రామ నారాయణరెడ్డి వివరించారు.

==================

గిరిజన గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సాలూరు మండలం బాగువలస గ్రామంలో ఈరోజు నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పెంచామని, మెగా డీఎస్సీ నిర్వహణ, దీపం-2, తల్లికి వందనం పథకాలను అమలు చేశామని చెప్పారు. త్వరలో అన్నదాత సుఖీభవ పథకంతో పాటు ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు.

==================

విరామం

==================

ప్రజా సేవే స్ఫూర్తిగా యువత విధులు నిర్వర్తించాలని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణ సేన్ ఆకాంక్షించారు. ఈరోజు గుంటూరు రైలు మహల్ లో నిర్వహించిన రోజ్గార్ మేళాలో జిల్లా వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన 74 మంది యువతకు ఆమె నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా సుధేష్ణ సేన్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు పొందిన యువత ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. అంకిత భావంతో పనిచేస్తూ అభివృద్ధి పథంలో పయనించాలని ఆమె సూచిస్తూ..

(వాయిస్ బైట్...30 సెకన్లు)

==================

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గా ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్ కు చెందిన సంజయ్ కుమార్ శ్రీవాస్తవ బాధ్యతలు స్వీకరించారు. 1988 బ్యాచ్ ఇండియన్ రైల్వే ఇంజనీరింగ్ సర్వీస్ కు చెందిన శ్రీవాస్తవ ఈ భాధ్యతలకు ముందు సెంట్రల్ ఆర్గనైజేషన్ ఆఫ్ రైల్వే ఎలక్ట్రిఫికేషన్ జనరల్ మేనేజర్‌గా పనిచేశారు.

==================

రైతుల ఇబ్బందులు తొలగించి వారిని అన్ని విధాలా ఆదుకునేందుకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. ఈరోజు తిరుపతిలో పర్యటించిన ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూ, ప్రభుత్వం సుపరిపాలనలో ముందుకు సాగుతోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. మామిడి రైతులకు చేయూత ఇచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ బైట్...15 సెకన్లు)

==================

అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీకి స్థలాన్ని సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈరోజు శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గృహ నిర్మాణ లే-అవుట్లు, వివిధ దశలలో ఉన్న గృహ నిర్మాణ వివరాలను అధికారులు మంత్రికి వివరించారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను సమగ్ర ప్రణాళికతో సిద్ధం చేయాలని టెక్కలి, పలాస రెవెన్యూ డివిజనల్ అధికారులను మంత్రి ఆదేశించారు. ఇళ్ల స్థలాల లే అవుట్ లను స్వయంగా పరిశీలించి, ప్రణాళికా బద్ధంగా ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇళ్లు మంజూరు చేయాలనే దృఢనిశ్చయంతో ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు.

===================

కడప వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విద్యార్థులకు వెంటనే ధృవ పత్రాలను జారీ చేయాలని కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (COA) అధికారులను ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కోరారు. ఈ మేరకు ఆమె విజయవాడలో కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అధికారులను కలిసి వినతి పత్రం అందించారు.

===================

లండన్ లోని లార్డ్స్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న మూడవ టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ లో 148 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మూడవరోజు ఆటను ప్రారంభించిన భారత్ భోజన విరామ సమయానికి 4 వికెట్ల నష్టానికి 248 పరుగులు చేసింది.

===================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్న  ఫలితంగా రాష్ట్రంలో రాగల రెండు, మూడు రోజుల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు  వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణం కేంద్రం తెలిపింది. మరిన్ని వివరాలను వాతావరణ శాఖ అధికారి వెల్లడిస్తూ..

(వాయిస్ బైట్…20 సెకన్లు)

===================

===================